క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రెబ్బెన: మండలంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ ఇమ్రాన్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ లక్ష్మిరాజం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

కెరమెరి: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ రమేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించగలరని కోరారు.

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



చెక్కులు అందజేస్తున్న విశ్వప్రసాద్‌రావు

రెబ్బెన: అర్హులైన ప్రజలందరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రానికి చెందిన పోచమ్మకు రూ. 46వేలు, మద్ది రామలక్ష్మికి రూ. 16 వేలు, రజితకు రూ. 14 వేలు చెక్కులను అందజేశారు. ఆపద సమయంలో పేద ప్రజలకు సీఎంఆర్‌ఎఫ్ ఆర్థిక భరోసా కల్పిస్తుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతీ సంక్షేమ పథకం అర్హులైన ప్రజలకు అందినప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రమేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవాజీ, మద్ది శ్రీనివాస్‌గౌడ్, చిరంజీవి గౌడ్, రాజేంద్రప్రసాద్‌గౌడ్, కిషన్ గౌడ్, సురేశ్ పాల్గొన్నారు.

నర్సరీ పనులు సక్రమంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీవో కృష్ణారావు

లింగాపూర్: పంచాయతీ ఆధ్వర్యంలో చేపడుతున్న నర్సరీ నిర్వహణ, ఉపాధిహామీ పనులు, ఇందిరమ్మ ఇళ్ల సర్వే పనులను సక్రమంగా నిర్వహించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో కృష్ణారావు సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. మట్టి నింపే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కోసం చేపట్టే సర్వేపై కార్యదర్శులు, ఉపాధి సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీవో రజనీకాంత్, ఈసీ వినోద్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

'గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయవద్దు'

కౌటాల: కోయగూడను కొత్త గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయవద్దని శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పుష్పలతకు పలువురు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోయగూడ గ్రామాన్ని గురుడుపేట గ్రామ పంచాయతీలోనే కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ధర్మయ్య, పుల్లయ్య, భగవాన్, సురేశ్, పోశయ్య, కోటేశ్వర్ పాల్గొన్నారు.

భూమిపూజ

రెబ్బెన: మండలంలోని తుంగెడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బోర్‌వెల్ ఏర్పాటుకు శుక్రవారం మాజీ ఎంపీపీ జుమ్మిడి సౌందర్య భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు ఇచ్చిన మాట ప్రకారం పాఠశాలలో తాగునీటి సమస్య తలెత్తకుండా ఎంపీపీ నిధులతో బోర్‌వెల్ మంజూరు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వినయ్‌కుమార్, సాయికృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

కాగజ్‌నగర్ రూరల్: కాగజ్‌నగర్ పట్టణ మున్నూరుకాపు యువక మండలి కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జువ్వాజి సంతోశ్, ఉపాధ్యక్షుడిగా వొల్లాల రాజ్ కుమార్, గుమ్మడి నవీన్, ప్రధాన కార్యదర్శిగా రాపెల్లి ప్రశాంత్, సంయుక్త కార్యదర్శిగా మరిశెట్టి సురేశ్, కార్యదర్శిగా గోపిశెట్టి తిరుపతి, ప్రచార కార్యదర్శులుగా సిద్దం ప్రణయ్, బోరె ఆకాశ్, పూదరి సాయి, సభ్యులుగా కస్తూరి, రవికిరణ్, మల్లికార్జున్, ఉప్పరి సాయికుమార్, బండి శ్రీమాన్ష్ పటేల్, తదితరులను ఎన్నుకున్నారు.

రైతుల పడిగాపులు

- పత్తి జిన్నింగ్‌మిల్లు వద్ద నిరీక్షణ
- రోజుల తరబడి వేచిచూస్తున్న రైతులు, వాహనదారులు

సిర్పూర్(టి): పత్తి రైతులు ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న సీసీఐలో పత్తిని విక్రయించేంకు నానా తంటాలు పడుతున్నారు. సీసీఐలో విక్రయించేందుకు జిన్నింగ్ మిల్లుల వద్ద పడిగాపులు కాస్తున్నారు. పత్తి పంటను వాహనాల్లో తీసుకొని బారులు తీరుతున్నారు. ప్రభుత్వం అందజేస్తున్న పత్తికి మద్దతు ధర ఉండడంతో పత్తి రైతులు సీసీఐలో పత్తిని విక్రయించుకునేందుకు ముందుకు వస్తున్నారు. అయితే సిర్పూర్(టి) మండలలో ఒకే ఒక్క సీసీఐ కొనుగోలు పత్తి జిన్నింగ్ మిల్లు ఉండడంతో మండలంలోని గ్రామాల రైతులతో పాటు సమీప మండలాలైన కౌటాల, చింతలమానెపల్లి, కాగజ్‌నగర్ మండలాల నుంచి సైతం రైతులు పత్తిని విక్రయించుకునేందుకు జిన్నింగ్ మిల్లుకు వస్తున్నారు.

రోజుల తరబడి..

రైతులు తమ పండించిన పంటను విక్రయించుకునేందుకు ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న సీసీఐ జిన్నింగ్ మిల్లు వద్ద పత్తి రైతులు, వాహనాల డ్రైవర్లు రోజుల తరబడి నిరీక్షిస్తున్నారు. మండలంలో ఒకే ఒక్క జిన్నింగ్ మిల్లు ఉండడంతో కాంటా చేయడం, రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయడం, పత్తి వాహనం అన్‌లోడ్ చేయడంలో జాప్యం జరుగుతుంది. సిర్పూర్(టి), కౌటాల ప్రధాన రహదారిలో వెంకట్రావ్‌పేట్ గ్రామ సమీపంలోని శ్రీరామ జిన్నింగ్ మిల్లు వద్ద వాహనాలు బారులు తీరడంతో సిర్పూర్(టి)– కౌటాల ప్రధాన రహదారిలో వాహనాల రాకపోకలకు అంతరాయం వాటిల్లుతుంది. రోడ్డుకు ఒక పక్క పూర్తిగా కిలోమీటరు మేరకు పత్తి వాహనాలు నిలిచి ఉంటున్నాయి. జిన్నింగ్ మిల్లులో పత్తి కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా చేయాలని, రైతులకు సౌకర్యాలు కల్పించాలని మండల రైతులు కోరుతున్నారు. అదే విధంగా సిర్పూర్(టి)– కౌటాల ప్రధాన రహదారి గుండా వాహనాల రాకపోకలకు అంతరాయం వాటిల్లకుండా పార్కింగ్ స్థలం కేటాయించాలని కోరుతున్నారు.



వెంకట్రావ్‌పేట్ జిన్నింగ్ మిల్లు వద్ద బారులు తీరిన పత్తి వాహనాలు

రెండు రోజులుగా వాహనంలోనే..



పత్తిని విక్రయించుకునేందుకు జిన్నింగ్ మిల్లుకు వస్తే జిన్నింగ్ మిల్లు వద్ద వాహనాలు బారులు తీరి ఉన్నాయి. చేసేదేమి లేక జిన్నింగ్ మిల్లు వద్ద ఉన్న వాహనాల క్యూలైన్‌లోనే ఉంచగా.. రెండు రోజుల నుంచి వాహనంలోనే పడిగాపులు కాస్తున్నా.. జిన్నింగ్ మిల్లులో పత్తి కొనుగోలు ప్రక్రియ నెమ్మదిగా కొనసాగుతుండటంతో వాహనాల అన్‌లోడ్‌కు ఆలస్యమవుతుంది.

– నరేశ్‌యాదవ్, రైతు

కొనుగోళ్లు వేగవంతం చేయాలి



జిన్నింగ్ మిల్లులో పత్తి కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా చేయాలి. పత్తి విక్రయించుకునేందుకు వాహనాలతో జిన్నింగ్ మిల్లుకు వస్తే క్యూలైన్‌లో రోజుల తరబడి నిరీక్షిస్తూ.. తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. జిన్నింగ్ మిల్లులో పత్తి వాహనాల కాంటా చేయడం, అన్‌లోడ్ చేయడం, వేగవంతంగా చేయాలి.

– ఆలూ నాయక్, రైతు

కౌటాల జిన్నింగ్ మిల్లు వద్ద బారులుదీరిన వాహనాలు



సిర్పూర్(టి) జిన్నింగ్ మిల్లు వద్ద వాహనాల వరుస



పత్తితీత పనులు జోరుగా సాగుతుండటంతో సీసీఐ కేంద్రాలకు వాహనాలు భారీగా పోటెత్తాయి. కొనుగోళ్లలోనూ తీవ్ర జాప్యం జరుగుతోంది. శుక్రవారం కౌటాల, సిర్పూర్(టి) జిన్నింగ్ మిల్లుల వద్ద కిలోమీటర్ల పొడువునా వందలాది పత్తి వాహనాలు బారులు తీరి దర్శనమిచ్చాయి. సీసీఐ అధికారులు తేమ విషయంలో కొర్రీలు పెడుతుండటంతో తమవంతు కోసం మూడు రోజుల నుంచి ఎదురుచూస్తున్నామని కొంతమంది రైతులు తెలిపారు. రాత్రిపూట చలికి వణికిపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. – కౌటాల

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు పంపిణీ చేస్తున్న నాయకులు

తిర్యాణి: అనారోగ్యంతో ప్రవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందిన మండల కేంద్రానికి చెందిన కళ్యాణ అరుణకు మంజూరైన రూ. 50 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును కాంగ్రెస్ నాయకులు కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిత్తారి సాగర్ మాట్లాడుతూ నిరుపేదలకు ఏ కష్టం వచ్చిన ప్రభుత్వం ఆదుకుంటామన్నారు. యూత్ అధ్యక్షుడు పున్నం హరీశ్, నాయకులు వెంకటేశం గౌడ్, మేడిశెట్టి శంకర్, కిరణ్‌కుమార్, బుద్దే చిన్నయ్య, రంజిత్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

ఆసిఫాబాద్‌అర్బన్: అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న నిరుపేద కుటుంబాలకు సీఎంఆర్‌ఎఫ్ ఒక వరమని డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావ్ అన్నారు. మండలంలోని బురుగ్గుడా గ్రామానికి చెందిన సాయికిరణ్ సీఎం సహాయ నిధికి గతంలో దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ. 8 వేల చెక్కును శుక్రవారం జిల్లా కేంద్రంలో డీసీసీ అధ్యక్షుడు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బాలేశ్వర్‌గౌడ్, నాయకులు చరణ్, ఆసిఫ్, అసద్, రూప్‌నార్ రమేశ్, శంకర్, తిరుపతి, జమీర్, తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావ్

ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైంది

నార్నూర్: ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైందని, అంకిత భావంతో పని చేస్తే సమాజంలో గుర్తింపు ఉంటుందని ఎంఈవో పవార్ అనిత అన్నారు. శుక్రవారం మండలంలోని మాన్కాపూర్ గ్రామ పంచాయతీ భవనంలో ఇటీవల బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల మాన్కాపూర్ నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు. బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు నీలయ్య, రాజేశ్వర్, రాజబాబు, విజయ్, ప్రతాప్, రవీందర్, వాచ్‌మెన్ అమృత్‌రావులను మాజీ సర్పంచ్ రాథోడ్ సావీందర్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తొడసం నాగోరావ్‌ల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. గురువుల దీవెనల ద్వారా ప్రతిఒక్కరూ ఉన్నత స్థాయికి ఎదుగుతారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లవ్ కుమార్, వీటీడీఏ ఉపాధ్యక్షుడు రాథోడ్ గణేష్, మాజీ ఉపసర్పంచ్‌లు రూప్‌దేవ్, రాథోడ్ గోవింద్, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామస్తులు

20 నుంచి సంతోషిమాత బ్రహ్మోత్సవాలు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని సంతోషిమాత బ్రహ్మోత్సవాలను ఈనెల 20 నుంచి 22 వరకు మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అనురాజ్‌రెడ్డి, గోవర్దన్‌రెడ్డిలు శుక్రవారం తెలిపారు. ఈ 20న ఉదయం 8 గంటలకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి బ్రహ్మోత్సవాలు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. 21న సుప్రభాత సేవ, వేదపఠం, గణపతి పూజ, పుణ్యావచనం, నవగ్రహపూజ, చండీ హోమం, పూర్ణహుతి, 22న ఉదయం 5 గంటలకు మహాభిషేకం, 9 గంటలకు అమ్మపాదుకలతో అమ్మవారి పల్లకి ఊరేగింపు, 11 గంటల నుంచి అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

పశువుల వాహనం పట్టివేత

వాంకిడి: అక్రమంగా తరలిస్తున్న పశువుల వాహనాన్ని శుక్రవారం ఉదయం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని లంజన్వీర ఎక్స్‌రోడ్ వద్ద తనిఖీ చేయగా.. వాంకిడి మండలం అకిని గ్రామానికి చెందిన మొహమ్మద్ మోహిముద్దీన్ అలీ, అదె సోనేరావు, హైదరాబాద్‌కు చెందిన రియాజ్ ఖురేషిలు మహారాష్ట్ర వైపు నుంచి ఆసిఫాబాద్ వైపుకు టీఎస్20టి 6061 నంబరు వాహనంలో పశువులను తరలిస్తూ.. పట్టుబడ్డారు. దీంతో ముగ్గురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. వాహనాన్ని సీజ్ చేసి పట్టుబడిన ఎనిమిది పశువులను కాగజ్‌నగర్ గోశాలకు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.



పట్టుబడిన పశువుల వాహనం

జర్నలిస్టుల భద్రతకు ప్రత్యేక చట్టం రూపొందించాలి

బెజ్జూర్: జర్నలిస్టుల భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక చట్టం రూపొందించాలని జర్నలిస్టులు డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో మీడియా ప్రతినిధులపై సినీ నటుడు మోహన్‌బాబు దాడిని నిరసిస్తూ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు సంఘం నాయకులు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో ఉప తహసీల్దార్ భీమ్లా నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోహన్ బాబు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయనపై హత్యాయత్నం కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బొజ్జ మహేశ్, శ్రీరాం, మోహన్ చారి, ఏలేశ్వరం, శ్రీకాంత్ చారి, రాచకొండ నగేశ్, సామల తిరుపతిచ కనికుట్ల శ్రీనివాస్, జావిద్ అలీ పాల్గొన్నారు.

లింగాపూర్: మీడియా ప్రతినిధులపై దాడి చేసిన సినీ నటుడు మోహన్‌బాబుపై కేసు నమోదు చేయాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు రామేశ్వర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జాదవ్ సతీష్, రాథోడ్ వినోద్, దవనే ప్రకాష్, రాథోడ్ మనోజ్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

జర్నలిస్టులపై దాడి సహించేది లేదు

ఆసిఫాబాద్‌అర్బన్: జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ అన్నారు. హైదరాబాద్‌లో జర్నలిస్టుపై సినీ నటుడు మోహన్‌బాబు చేసిన దాడిని ఖండిస్తూ శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. విధి నిర్వాహణలో ఉన్న మీడియా ప్రతినిధులపై దాడి చేయడం సిగ్గు చేటన్నారు. మీడియాపై జరుతున్న దాడులను అరికట్టేందుకు ప్రభుత్వాలు స్పందించి జర్నలిస్టుల భద్రతకు ప్రత్యేక చట్టాలు తేవాలన్నారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్ ధోత్రెకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రకాష్‌గౌడ్, శ్రీనివాస్‌రావ్, తారు, బిక్కాజీ, రమేశ్, రాధాకృష్ణచారి, తిరుపతిచారి, హన్నాన్, మోయిన్, నరేశ్, రవి, సాయి, రాజు, ఖలీల్, మిలీన్ పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కౌటాల: జర్నలిస్టులపై దాడి చేస్తే సహించేదిలేదని కౌటాల ప్రెస్‌క్లబ్ మండల అధ్యక్షుడు నరేశ్ అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పుష్పలతకు వినతిపత్రం అందజేశారు. సినీ నటుడు మోహన్‌బాబు జర్నలిస్టులపై దాడి చేయడం సరికాదన్నారు. దాడులు అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో విలేకరులు రవి, తిరుపతి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో సత్తా చాటాలి



క్రీడా దుస్తులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

కౌటాల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు క్రీడల్లో సత్తా చాటాలని హెచ్‌ఎం నారాయణ్‌సింగ్ అన్నారు. శుక్రవారం కౌటాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో నెట్‌బాల్ క్రీడాకారులకు ఉపాధ్యాయులు యేసుమణి, సంధ్యారాణి ఉచితంగా క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులు చదువుతో పాటు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. సీఎం కప్ పోటీల్లో క్రీడకారులు ప్రతిభ కనబర్చాలని కోరారు. ప్ర భుత్వ పాఠశాలల్లో మెరుగైన చదువుతో పాటు క్రీడల్లో నైపుణ్యాలు నేర్పిస్తున్నమన్నారు. కార్యక్రమంలో పీడీ హరికృష్ణ, ఉపాధ్యాయులు రమేశ్, రాంచందర్, చారి, శివాజీ పాల్గొన్నారు.

కొలావార్ సంఘం జిల్లా కార్యదర్శిగా రూపేష్



రూపేష్

చింతలమానెపల్లి: మండలంలోని గూడెం గ్రామానికి చెందిన బుర్రి రూపేష్ ఆదివాసీ కొలావార్ సేవా సంఘం జిల్లా కార్యదర్శిగా ఎంపికయ్యారు. శుక్రవారం సంఘం జిల్లా అధ్యక్షుడు బుర్స పోశం ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ ఆదివాసీ కొలవార్ హక్కుల కోసం పాటు పడుతానన్నారు.

కేజీబీవీ ఉద్యోగుల నిరసన



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

పెంచికల్‌పేట్: సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో శుక్రవారం నాన్‌టీచింగ్ సిబ్బంది మధ్యాహ్న భోజన సమయంలో నిరసన తెలిపారు. ఎన్నికల్లో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో లలిత, స్వరూప, కల్యాణ, సంగీత, మమత, స్వరూప పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతులు

కాగజ్‌నగర్ రూరల్: మండలంలోని భట్‌పల్లి– అందవెల్లి గ్రామాల మధ్య గల ప్రధాన రహదారికి కొత్తపల్లి వెంకటలక్ష్మి చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ తాత్కాలిక మరమ్మతులు చేయించారు. కాగజ్‌నగర్ నుంచి దహెగాం వెళ్లే విద్యార్థులు, వ్యాపారస్తులు ఇబ్బంది పడుతుండడంతో సొంత ఖర్చులతో మరమ్మతులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చన్నపురి గణపతి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అందని శుద్ధజలం

దహెగాం: ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నా నిరుపయోగంగా మారుతున్నాయి. శుద్ధజలం ప్లాంటు పని చేయకపోవడంతో విద్యార్థులకు ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని కల్వాడ ఆశ్రమ పాఠశాలలో 3 నుంచి 10 తరగతులు ఉండగా.. సుమారు 208 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. అదేవిధంగా విద్యార్థులకు ఏర్పాటు చేసిన సోలార్ హీట్‌వాటర్ సైతం నిరుపయోగంగా మారడంతో విద్యార్థులు చల్లటి నీళ్లతో స్నానాలు చేస్తున్నారు. మరుగుదొడ్లే శిథిలావస్థకు చేరాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి శుద్ధజలం ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.



విద్యార్థులు తాగే ట్యాంకు నీరు

'మన్నెవార్‌లను కొలాంలుగా గుర్తించొద్దు'

తిర్యాణి: ఎస్టీ జాబితాలో ఉన్న మన్నెవార్లు నిబంధనలకు విరుద్ధంగా కోలవార్‌లుగా ధ్రువీకరణ పత్రాలు పొందుతున్నారని వారిని కొలాంలుగా గుర్తించవద్దని లం సంఘం మండల అధ్యక్షుడు ఆత్రం బోజ్జిరావు డిమాండ్ చేశారు. ఈనెల 16న ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. మన్నెవార్లు జీవిస్తున్నా గ్రామాలను కొలాం గ్రామాలుగా మార్చి కొలాంలుగా చెలామణి అవుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు పుసం రాజు, ఆత్రం భీంరావు, టేకం రాజు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు